నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం

షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనొ-పెడ్రొ మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్

బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదు న్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలిం ది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచో వా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డటైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్‌ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.

హర్మన్ (15)

దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ప్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరఫున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రోస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహుహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ప్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ప్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ప్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ టపటప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్‌ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ప్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)
భారత్ : 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహుహు 3/15)

భారత షూటర్లకు మరో స్వర్ణం

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్

లక్నో: ప్రతిష్ఠాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

సఫారీల శుభారంభం

• వెస్టిండీస్‌పై ఘనవిజయం

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకో లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట్ (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

లబ (4/29)

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ బాబూలాల్

6న బంజారా భవన్ నిర్మాణానికి భూమి పూజ

ఎదులాపురం, అక్టోబర్ 4 : కేసీఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్‌లోని పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో కేటాయించిన స్థలంలో రూ.2కోట్లతో బంజారా భవన్ నిర్మాణానికి ఆదివారం ఉదయం 11 గంటలకు భూమి పూజ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ బాబూలాల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాథోడ్ రామారావ్, సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. భూమిపూజ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, జాదవ్ అనిల్, వెడ్మ బొజ్జూపటేల్, ఎంపీ నగేశ్, జాతీయ అధ్యక్షుడు, మాజీమంత్రి అమర్‌సింగ్ తిలవత్, కర్నాటక మంత్రి బాబురావ్ చౌహాన్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బంజారా సోదరి సోదరులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమం అనంతరం జిల్లా కార్యవర్గం సైతం ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఐబీఎస్ఎస్ నాయకులు జాదవ్ బలిరాం నాయక్, రాథోడ్ హీరాల్ నాయక్, చౌహాన్ వినాయక్‌నాయక్, సతీశ్ నాయక్, రాథోడ్ విజయ్ పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 4 : నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం (నవభారత సాక్షరత) న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం కార్యక్రమాన్ని రూపొందించిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్ వయోజన విద్యా శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15 ఏళ్లపై బడిన నిరక్షరాస్యులను గుర్తించి ఐదు దశల్లో వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాలో 18051 మంది లక్ష్యం కాగా ఇందులో పురుషులు 7,220, స్త్రీలు 10, 831 మంది ఉన్నారని, వాలంటరీ లర్నర్స్ డిటైల్స్ 10 రోజుల్లో ఐడెంటిఫై అయిన వారికి ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పూర్తిగా స్వచ్ఛందంగా స్థానిక వాలంటీర్ల ద్వారా అమలు కానున్నదని, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయుల సహకారంతో వాలంటీర్ల ద్వారా వయోజనులకు సాయంత్రం వేళలలో అక్షరాస్యతను అందించనున్నారని తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో సాయన్న, పీడీ మెప్మా మమత, జిల్లా వైద్యాధికారి కృష్ణ, విద్యాశాఖ ద్వారా సుధాకర్, మున్సిపల్ కమిషన్ ఖమర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టెలికాం అధికారులతో సమావేశం

ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం (రైట్ ఆఫ్ వే) ఆర్‌వోడబ్ల్యూ డీఎల్సీ మీటింగ్, కేబుల్ ఎక్సవేషన్స్ సీ-బడ్ కాల్ బీఫోర్ యూ డిగ్ మొబైల్ యాప్‌పై కేబుల్ ఎక్సవేషన్స్ తవ్వడం వాటి అనుమతులతో అన్ని టెలికాం ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ సీ-బడ్ యాప్‌ను (కాల్ బీఫోర్ యుడిక్) అందరూ రిజిస్ట్రేషన్ చేసుకొని ఉపయోగించుకోవాలని అన్నారు. అటవీ శాఖలో ఉన్న ఫారెస్ట్ పర్మిషన్ కోసం పెండింగ్‌లో ఉన్నవి, మిషన్ భగీరథ పైప్‌లైన్ డ్యామేజ్, కొత్త రహదారులు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఇరిగేషన్ ఎస్ఈ సురేశ్, టీ ఫైబర్ జిల్లా మేనేజర్ భరత్ చంద్ర, ఈడీఎం రవీందర్, ఆర్అండ్ బీ, డీజీఎం, పీఆర్, విద్యుత్, అటవీ శాఖాధికారులు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేయించుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 4 : డీఎస్సీ 2024లో 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల లిస్టులో పేరు ఉండి డీఎడ్ పరీక్షా ఫలితాలలో పాసైన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు నిర్మల్‌లోని కొండాపూర్ సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ధ్రువీకరణ పత్రాలు వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించిన 2 సెట్ల జిరాక్స్ ప్రతులు తీసుకొని రావాలని సూచించారు.

మహిళ పై హత్యాయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 4 : ఇంద్రవెల్లికి చెందిన ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ కాత్లే భీంరావ్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన కారు డ్రైవర్ ఇమ్రాన్ భీంనగర్‌కు చెందిన చాటే లక్ష్మి వద్ద గత సంవత్సరం రూ. 6లక్షలు అప్పుగా తీసుకున్నారు. తీసుకున్న అప్పును విడుతల వారీగా చెల్లించాలని చాటే లక్ష్మి అడిగిన ఇవ్వడం లేదు. దీంతో రెండు సార్లు గ్రామ పెద్దలు, కుల పెద్దలతో పంచాయితీ నిర్వహిస్తే పెద్దల సమక్షంలో డబ్బులు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఆరు నెలలైన ఇప్పటి వరకు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలని చాటే లక్ష్మి అడిగితే గొడవకు దిగుతున్నాడు. డబ్బులు అడిగితే చంపివేస్తానని బెదిరించినట్లు తెలిపారు. ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నా 3గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇమ్రాన్ చాటే లక్ష్మి ఇంటిలో చొరబడి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. చాటే లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కాత్లే భీంరావ్ తెలిపారు.



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 4 : నిర్మల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణలను అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణపై జిల్లా స్థాయి వృత్తి నైపుణ్య సొసైటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు లబ్ధి పొందేలా వసతితో కూడిన శిక్షణను అందిస్తున్నదన్నారు. ఆసక్తి కలిగిన యువతను గుర్తించి వివిధ కోర్సులకు శిక్షణలు పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ వృత్తి నైపుణ్య కేంద్రాల ద్వారా శిక్షణ తీసుకున్నవారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మంచి అవకాశాలున్నాయన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, డీటీడీవో అంబాజీ, ఉపాధి కల్పన అధికారి శంకర్, మెప్మా పీడీ సుభాష్, వృత్తి నైపుణ్య సొసైటీ ప్రతినిధులు. అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: లింగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మతో అధ్యాపకులు, విద్యార్థులు

బేల : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు

బేల : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, డీఐఈవో

బేల, అక్టోబర్ 4 : బేలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సౌజన్యంతో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐఈవో రవీందర్ పాల్గొని బతుకమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో మండల కేంద్రం నుంచి ఎంసెట్ కోచింగ్ కోసం విద్యార్థులను పంపించడం జరుగుతుందన్నారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపాళ్లు భగవాండ్లు, సూర్య ప్రకాశ్, రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, అక్టోబర్ 4 : లింగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు మారుతి, కాక్నటే బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న హీరాసుక విగ్రహ ప్రతిష్ఠాపన భూమి పూజ

ఇంద్రవెల్లి, అక్టోబర్ 4: శ్రీ గోండి ధర్మగురు హీరాసుక విగ్రహ ఏర్పాటుకు ఈ నెల 7వ తేదీన నిర్వహించే భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ గ్రామపటేల్ గేడం జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హీరాసుక విగ్రహ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ఉదయం 11.30గంటలకు విగ్రహ ఏర్పాటు స్థలంలో భూమి పూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ ప్రధాన్ సమాజ్ ఉద్యోగులు, మేధావులు, కుల సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, తుడుందెబ్బ అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ నాయకులు, కుల పెద్దలు మరప రాజు, మెస్రం ఆనంద్‌రావ్, కనక భీంరావ్, సోయం రాందాస్, భారత్, రజనీకాంత్ పాల్గొన్నారు.

రూ. 18 కోట్లతో డబుల్ రోడ్డు పనులు

భీంపూర్, అక్టోబర్ 4 : ఆదిలాబాద్ – కరంజి(టీ) 50 కిలోమీటర్ల రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ఆర్టీసీ సహ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ ప్రభుత్వ హాయాంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు వచ్చాయి. తదనంతరం పనుల ప్రారంభంలో ఆలస్యమైంది. ఈ విషయాన్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సీరియస్‌గా తీసుకుని పనులు ప్రారంభిస్తామని మాట ఇచ్చారు. అలాగే కలెక్టర్ కూడా ఇక్కడి సమస్యను అర్థం చేసుకుని శ్రద్ధ చూపారు . ఫలితంగా ఇపుడు ఆదిలాబాద్ – కరంజి(టీ) రూట్‌లో రూ. 18 కోట్ల నిధులతో ఈదుల్లాసావర్గాం – పిప్పల్‌కోటి నడుమ డబుల్‌రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. 9 కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. అర్లి వరకు డబుల్‌రోడ్డు వస్తుండగా తర్వాత కరంజి వరకు కూడా నిర్మించనున్నారు. గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే జాదవ్ అనిల్, కలెక్టర్ రాజర్షిషాకు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎదులాపురం, అక్టోబర్ 4 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ పంటను అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని వ్యవసాయ శాఖ మార్కెట్ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. పంటను విక్రయించిన తొలి రైతును శాలువాతో సన్మానించారు. ప్రభుత్వం అందించే మద్దతు ధర రూ.4892కే రైతులు సోయాబీన్‌ను విక్రయించాలని సూచించారు. అనంతరం మార్కెట్‌కు వచ్చిన సోయాబీన్ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. దళారుల వద్ద పంటను అమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. మార్క్‌ఫెడ్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి మధుకర్, డీసీఓ మోహన్, అధికారులు శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ నాయకులు ముకుంద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు ప్రారంభంలో ప్రొటోకాల్‌పై వివాదం

బోథ్, అక్టోబర్ 4 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘం ద్వారా శుక్రవారం చేపట్టిన సోయా కొనుగోళ్ల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ వివాదం జరిగింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ (బీఆర్ఎస్) చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే రాకముందే మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, నాయకులతో కలిసి సోయా కొనుగోళ్లను ప్రారంభించి వెళ్లిపోయారు. కొద్ది సేపటికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వచ్చి కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నాయకులతో కొనుగోళ్లను ఎలా ప్రారంభిస్తారని సంబంధిత అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎం ప్రవీణ్‌రెడ్డిపై వాదించారు. అధికారులు సర్ది చెప్పడంతో ఎమ్మెల్యే శాంతించారు.